

# ఆంతర్యపు లోతుల్లో..... కె. దుర్గాదేవి

"అధికారం చూపించి ఆడదాన్ని లొంగదీసుకో లేవు కాబట్టి, భయపెట్టి అదుపులో పెట్టలేవు. పెళ్ళాన్ని ప్రేమగా చూడు. అది నిన్ను దేవుడల్లే చూసుకుంటది. దానిమీద నమ్మకం ఉంచు. నిన్ను ఒక్కనాటికీ మోసం చెయ్యదు. గుర్తుంచుకో" అంది నాంచారమ్మ.

* * *

నాంచారమ్మకు నాలుగు పదుల వయసుంటుంది. మాంచి ఒడ్డూ పొడుగూ ఉన్న భారీ విగ్రహం. అలాంటి ఒడ్డూ, పొడుగూ దృఢమైన అంగ సౌష్ఠవం మగవాళ్ళలోనే తప్ప ఆడవాళ్ళలో కన్పించటం అరుదనే చెప్పాలి. ఇహ ఆ ఒంటి రంగుందే అది అంజనాచల గర్వ భంజనం' చెయ్యగలదనటానికి సందేహించ నక్కర్లేదు. అయితేనేం ఆ కోలముఖం, వంకపెట్టలేని ఆ కనుముక్కు తీరు, ఒత్తుగా నిగనిగలాడే నొక్కుల జుట్టు నాంచారమ్మ అందగత్తె కాదనేందుకు మాత్రం వీల్లేదు

నాంచారమ్మ విశాలమైన నుదుటిమీద రూపాయి బిళ్ళంత కుంకుమబొట్టు పెట్టుకుంటుంది. ఒంటి మీద సర్వకాల సర్వావస్థల్లోనూ పాతిక ముప్పై కాసులకు తక్కువ కాకుండా బంగారం ధరించే ఉంటుంది. చెవులకి పెద్ద ఎఱ్ఱరాళ్ళ ఓద్దులు, మాటీలు, ముక్కున దగదగలాడిపోయే బేసరి, మెళ్ళో మంగళసూత్రం గొలుసుకాక నాలుగు పేటల చంద్రహారమూ, కంఠాన్నంటి పెట్టుకుని కాసులపేరూ, ఒక్కోచేతికి నాలుగేసి బంగారు గాజులూ వేళ్ళకు ఉంగరాలూ చూడగానే ఆమె ఐశ్వర్యమంతా కళ్ళు మిరుమిట్లు గొల్పుతూ కన బడిపోతుంది.

ఈ వివరాల్నిబట్టి నాంచారమ్మను 'ఒంటి నిండా నగల్తో లక్ష్మీదేవిలా కళకళలాడుతూ ఉంటుంది. అని వర్ణించాలంటే మాత్రం కుదరదు. ఎంచేతనంటే నాంచారమ్మ ముఖం ఎప్పుడు చూసినా తుమ్మలతోపులో పొద్దుగూకినట్టు ధుమ ధుమలాడుతూ ఉండటమే తప్ప కళకళలాడుతూ ఉండటమన్నది కల్లోగూడా ఉండదు. కాబట్టి చెప్పొచ్చేదేమిటంటే నాంచారమ్మ ఒంటినిండా నగల్తో 'లక్ష్మీదేవి'లా గాక అలంకరించిన 'గ్రామ దేవత' గంగానమ్మలా ఉంటుంది.

అలాంటి నాంచారమ్మ ఒకనాటి సాయంత్రం తన ఐశ్వర్యమంతా ప్రతిఫలించే అలంకరణతో 'రాజువెడలె రవి తేజములలరగ' అన్నంత ఠీవిగానూ నడిచి వెళ్తున్నదల్లా రాముడి గుడిసె ముందుకురాగానే ఠక్కున ఆగిపోయింది. ఆ గుడిసెలోంచి వినవచ్చిన స్త్రీ రోదన ఆమెకు అడుగు ముందుకు పడకుండా బంధంవేసింది.

ఒకచేత్తో పెళ్ళాం జుట్టు గట్టిగా పట్టుకుని రెండోచేత్తో దాని వీపుమీద ఇష్టం వచ్చినట్టు బాదుతున్న రాముడు పైకెత్తిన చేతిని ఎవరో పట్టుకోవడంతో తలెత్తి చూశాడు. ఎదురుగా నాంచారమ్మ!

"ఎందుకురా దాన్నట్టా సావగొడుతున్నావ్?" నాంచారమ్మ గదమాయించింది

"తాగొచ్చి ఉత్తపున్నాని కొట్టి సంపుతున్నాడమ్మా! ఈడి సేతులిరిగిపోనూ" ఏడుస్తూ మొగుణ్ణి శాపనార్థాలెట్టింది రాముడి పెళ్ళాం.

"దీని సంగతి నీకేం తెలుసు నాంచారమ్మా! దీన్నియాల సంపిగానీ వదల్ను. సెయ్యొదులు" కోపంగా రొప్పుతూ చెయ్యి గుంజుకున్నాడు. కానీ నాంచారమ్మ పట్టునుండి చెయ్యి విడిపించుకోటం వాడి తరం కాలేదు.

ఈ అదను కనిపెట్టి ఆత్మరక్షణార్థం బయటికి పరుగెత్తింది రాముడి పెళ్ళాం. అదలా ఉడా యించటం చూసి మెల్లిగా రాముగి చెయ్యొదిలి పెట్టి, "ఆడదాన్ని కొట్టటం అదీ ఒక మగతనమే న్రటా, రాముడూ!" అంచి.

"అదిగాదు..." అంటూ ఏవో చెప్పబోయిన రాముణ్ని మాట్లాడనివ్వకుండా మధ్యలోనే అందుకుని "అదీ గాదు, ఇదీ కాదు గానీ ఒకమాట సెపుతాయిను అని ఏదో రహస్యం చెబుతున్న దానిలా గొంతు తగ్గించి, "అధికారం చూపించి ఆడదాన్ని లొంగదీసుకోలేవు. కొట్టి, భయపెట్టి అదుపులో పెట్టలేవు. పెళ్ళాన్ని ప్రేమగా చూడు. అది నిన్ను దేవుడల్లే చూసుకుంటది. దానిమీద నమ్మకం ఉంచు అది నిన్ను ఒక్కనాటికీ మోసం చెయ్యదు గుర్తుంచుకో. ఇంకెప్పుడూ దాన్ని కొట్ట మాకు" అంటూ రాముడికి హితబోధ చేసి అక్కణ్ణుంచి కదిలింది నాంచారమ్మ.

నాంచారమ్మ రాముడికి చెప్పిన ఆ నాలుగు ముక్కలూ ఒట్టి మాటలుకావు. ఆమె అనుభవ సారం ఆ మాటలు ఆమె జీవితమంతా సంగ్రహంగా ఆ నాలుగు ముక్కల్లో ఇమిడి ఉంది.


ఇరవై ఏళ్ళ కిందటి నాంచారమ్మకూ ఇప్పటి నాంచారమ్మకూ వయసులోనేకాదు, ఇంకా చాలా విషయాల్లో చాలా తేడా ఉంది. ఆ రోజుల్లో ఆమె ముఖంలో ముగ్ధత్వం, కళ్ళల్లో కరుణ, హృదయంలో మార్దవం ఉండేవి.

నాంచారమ్మ మొగుడు శివయ్య వట్టి అమా

**ఈ వరసచూసి నాంచారమ్మ నిప్పుమీద పడ్డ ఉప్పులా చిటపటలాడింది. శివమెత్తినట్టు చిందులుతొక్కింది. ఎదుటలేని వెంకటేశుని తిట్టినతిట్టు తిట్టకుండా అనర్గళంగా తిట్టిపోసింది. ఎన్ని తిట్టినా ఎంత తిరిగినా......**

మానవు మనిషి. రోజూ ఏదో ఒక సాకుతో పెళ్ళాన్ని చితగొడుతుండే వాడు. అన్నం తినటం, నీళ్ళు తాగటం ఎలాగో పెళ్ళాన్ని చావదాదడం కూడా అలాగే అతని దైనిక కార్యక్రమాల్లో ఒకటి.

దెబ్బలు తినీతినీ, అపనిందలు పడీపడీ నాంచారమ్మ శరీరమూ హృదయమూ కూడా చితికి



పోయాయి. అలాంటి సమయంలో ఆమెకు రాఘవులు తారసపడ్డాడు.

రాఘవులు తెగిన గాలిపటంలా, గాలికి కొట్టుకొచ్చిన ఎండుటాకులా ఎక్కణ్ణుంచి ఆ వూరు వచ్చిపడ్డాడో ఎవరికీ తెలియదు. వచ్చినా వాడు శివయ్య ఇంటికి కాస్త దూరంలో పాడుబడి ఉన్న పాకలో మకాం పెట్టాడు. నా అనేవాళ్ళు ఎవ్వరూ లేని ఏకాంతంలో నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా కాలం వెళ్ళదీసే రాఘవులు నాంచారమ్మ దృష్టిలో పడ్డాడు.

రాఘవుల్ని చూశాక నాంచారమ్మలో ఏవేవో ఆలోచనలు తలెత్తాయి. భర్తచేత రోజూ చావు దెబ్బలు తింటూ గొడ్డుకన్నా హీనంగా బతికే ఈ బ్రతుకు అక్కర్లేదనిపించింది. తనెంత నీతిగా ఉన్నా మొగుడు తనను అనుమానించకా మానడు. తన్నకుండానూ ఉండడు. నీతిగా బతికినందువల్ల తనకు జరిగిందేమీలేదు. తనకీ మొగుడూ వద్దు. నీతీ వద్దు. చావుదెబ్బలూ వద్దు. ఈ నరకం నుండి పారిపోవాలి. శివయ్య వేసే నిందల్ని నిజంచేసి ఇల్లొదిలి పోతేసరి. అప్పుడు-శివయ్యని పెళ్ళాం వదిలేసిందని అందరూ వేలెత్తి చూపిస్తుంటే-అప్పుడుగానీ వాడికి తగినశాస్తి జరగదు. ఇలా ఆలోచించిన నాంచారమ్మ రాఘవుల్తో స్నేహంకట్టి, ఒకానొక రోజున వాడితో లేచిపోయింది. కాదు-నాంచారమ్మ రాఘవుల్ని లేవదీసుకుపోయింది.

"ఏం నాంచారమ్మత్తా! బాగున్నావా?" పలకరింపుతో గతస్మృతుల్లోంచి తేరుకుంది. ఎదురై పలకరిస్తున్నాడు జోగులు.

"ఆఁ ఏడిసినట్టే ఉంది నా బాగు. హాయిగా తినికూర్చోలేక డబ్బిచ్చి కొనితెచ్చుకోవటమైంది నా పని. డబ్బు కావాల్సి వచ్చినప్పుడు ప్రతి ఎదవకీ నాంచారమ్మే కావాలి. ఇవ్వను పొమ్మన్నా ఇనకుండా కాళ్ళట్టుకుని కదలమంటారు. తీరా పబ్బంగడిచాక కళ్లు నెత్తికెక్కుతాయి. అవసరానికి డబ్బిచ్చి ఆదుకున్న పాపానికి మీ కొంపల చుట్టూ తిరగలేక చస్తున్నాను. అయ్యో అంటే ఆర్నెల్లు కర్మ" అంటూ అందర్నీ కలిపి ఉమ్మడిగా ఓ వరస ఝాడించేసి, ఆఖర్న "ఇంతకీ ఆ దొంగ సచ్చినోడు ఎంకటేశుగాడు ఇంట్లో ఉన్నాడా?" అంది.

"అడికేం, నాంచారమ్మా! మారాజు వారం రోజులైంది, ఎక్కణ్ణుండో ఒక పిట్టను కొట్టుకొచ్చాడు. పిట్టంటే పిట్టా! పంచరంగుల రామచిలకే ననుకో! ఇంక సూసుకో, నా సామిరంగా! ఒకరేత్తిరనీలేదు, పగలనీలేదు-ఇరవై నాలుగ్గంటలూ ఒకటే పకపకలూ ఇక ఇకలూను. ఇంతకుముందు నేనటుకేసి ఎల్లినప్పుడు ఇంటోనే ఉన్నాడుమరి" అసలే వెంకటేశుమీద నాంచారమ్మ అగ్గయిపోతుంటే దానిమీద తనమాటలు గుగ్గిలం కాస్త జల్లి తనదారి తను చక్కాపోయాడు జోగులు.

నాంచారమ్మకు టౌన్లో ఒక టీ దుకాణం ఉంది. రిక్షావాళ్లూ, ఫ్యాక్టరీల్లోనూ ఇతరత్రా పనిచేసే కూలీలు మొదలైన 'అలగా' జనమంతా నాంచారమ్మకు కొట్లోనే టీ తాగుతారు. అదిగాక నాంచారమ్మ వడ్డీ వ్యాపారంకూడా ఉంది. అందరి విషయంలోలాగా నాంచారమ్మ విషయంలో వడ్డీ వ్యాపారం కేవలం డబ్బు గడించిపెట్టే వ్యాపకం మాత్రమే కాదు. ఆమె జీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన వ్యాసంగమది. అదేలాగో తెలుసుకోవాలంటే నాంచారమ్మ గురించి కాస్త విపులంగా చెప్పుకోవాల్సుంటుంది.

నాంచారమ్మ నిద్రాహారాలు లేకుండా కొన్ని రోజులుండగలదు కానీ ఎవరితోనో ఒకరితో పోట్లాడకుండా ఒక్కరోజైనా ఉండలేదుగాక ఉండలేదు. ఇతరుల్ని తనకు చేతనైన రీతిలో బాధించి తద్వారా ఆనందించటం నాంచారమ్మ ప్రవృత్తిలోని విశేషం. నిత్యమూ ఏదో ఒక సాకుతో ఎవర్నో ఒకర్ని తిట్టిపొయ్యటం, వీలైతే కొట్టటం ద్వారా తన యీ ప్రవృత్తిని తృప్తి పరుచుకుంటూ ఉంటుంది ఇందుకు అవసరమైన

మనుషుల్ని వడ్డీ వ్యాపారం ద్వారా సమకూర్చుకో గలుగుతుంది. ఈ రకంగా వడ్డీ వ్యాపారం ధనార్జనకు ఉపకరించే వ్యాపకం మాత్రమేగాక ఆమెలోని హింసాప్రవృత్తిని సంతృప్తి పరిచే సాధనం కూడాను.

తాకట్టుతో నిమిత్తం లేకుండా (తాకట్టు పెట్టేందుకు వాళ్ళ దగ్గరేముంది గనుక) కేవలం టీ కొట్టు పరిచయాన్ని పురస్కరించుకుని వాళ్ళకు అప్పు ఇచ్చే వ్యక్తి ఆ టౌన్లో నాంచారమ్మ ఒక్కతే. కనుక నాంచారమ్మ దుకాణంలో టీ తాగే వాళ్ళంతా డబ్బు అక్కర వచ్చినప్పుడల్లా దగ్గరే అప్పు తీసుకోవటం పరిపాటి.

అప్పు తీసుకున్న వ్యక్తి నెలనెలా గడువు లోపల వడ్డీ చెల్లించకపోయాడో ఒక్కరోజైనా ఉపేక్షించదు నాంచారమ్మ. ఆ మర్నాడే ధ్వజమెత్తి ఎకాఎకి వాడింటికి వెళ్తుంది. వెళ్ళిన మనిషి ఇంటిలోపలికి వెళ్ళి మాట్లాడదు తాను నడివీధిలో నిలబడి సకాలంలో వడ్డీ డబ్బు చెల్లించలేకపోయిన ఆ నిర్భాగ్యుణ్ణి రచ్చకీడ్చి మరీ మాట్లాడుతుంది. మాట్లాడట మంటే మామూలుగా మాట్లాడటం కాదు, అటువంటి సమయాల్లో నాంచారమ్మ నోరు విప్పిందంటే సభ్యమానవులెవరూ వినలేనంత, చెవులు మూసుకుని తిరిగి చూడకుండా మైలు దూరం పరుగెత్తేటంత దారుణమైన కారుకూతలూ బండబూతులూ ఏకధాటిగా నోట్లోంచి బయటికి దూకేస్తాయి. ఇలా తన సహజధోరణిలో అప్పు తీసుకున్నవాణ్ణి ఒక్కణ్ణే మాత్రమే ప్రక్షాళన చేసి ఊరుకోదు. వాడి అమ్మనూ, ఆలినీ, అక్కనూ చెల్లినీ ఇంకా మాట్లాడితే అటు ఏడు ఇటు ఏడు తరాల వాళ్ళని కూడా దులిపి దుమ్మెత్తి పోసిగానీ వదలదు. అవతలి వాళ్ళు అర్భకులో అండలేని వాళ్ళో అయిన సందర్భాల్లో నాంచారమ్మ మరీ విజృంభించి చెయ్యి చేసుకున్న ఉదంతాలు సైతం లేకపోలేదు.

ఇలాంటి నాంచారమ్మ దగ్గర నాలుగునెలల క్రితం వెంకటేశు అనే కూలీ వందరూపాయలు అప్పుచేశాడు. సదరు వెంకటేశు నాంచారమ్మకు ఎంతమాత్రమూ తీసిపోని సరిజోడు. ఈ విషయం నాంచారమ్మకెలా తెలిసొచ్చిందీ అంటే నాంచారమ్మంతటి వ్యక్తి దగ్గర అప్పుచేసి నాలుగు నెలలు గతించినా వాడు అసలుగానీ వడ్డీగానీ కనీసం ఒక పైసయినా చెల్లు వెయ్యకుండా నెగ్గుకు రాగలగడం వల్ల.

మొదటి నెల గడువుకు వెంకటేశు వడ్డీ చెల్లు వెయ్యక పోవడంతో ఆనవాయితీ ప్రకారం నాంచారమ్మ వాడింటికి వెళ్ళింది కానీ నాంచారమ్మ తన స్వరూపాన్ని, వాగ్ధాటినీ ప్రదర్శించే అవకాశమే ఇవ్వలేదు వెంకటేశు. అల్లంత దవ్వున నాంచారమ్మ కనబడిందో లేదో గబగబా లేచి ఎదురెళ్ళాడు. వినయం ఉట్టిపడేస్వరంతో, వరుస కూడా కలిపేసి, "అక్కా! నువ్వింత దూరం రావాలా, నాకోసం? అందర్లాటోణ్ణి కాను నేను. నిన్ను ఇబ్బంది పెడతానా? నీ డబ్బు పువ్వుల్లో పెట్టి నీకాడికే తెచ్చివ్వనూ!" అన్నాడు.

ఆ ఆత్మీయత ముందు పంచదార లాంటి ఆ పలుకు తీపి ముందు నాంచారమ్మ నోరెత్తలేకపోయింది. ఇంతా చెప్పి చివర్న, "ఈనెల్లో అనుకోని ఖర్చు లొచ్చిపడి డబ్బు కట్టలేకపోయాను. ఏమనుకోకు పైనెల్లో రెణ్ణెల్ల వడ్డీ డబ్బు ఒక్కసారే జమ కడతాను. పెద్దదానివి నువ్వొచ్చేట్టు చేత్తానా?" అన్నాడు అభిమానం తొణికిసలాడే గొంతుకతో. నాంచారమ్మతో కలిసి నాలుగడుగులు నడిచి సగౌరవంగా సాగనంపాడు కూడా.

తర్వాత నెల గడువుదాటి పోయినా, ఏదో ఒకరోజు వెంకటేశు తన ఇంటికే వచ్చి డబ్బు చెల్లిస్తాడనే భరోసాతో ఊరుకుంది నాంచారమ్మ.



## ఏం చేస్తారు?

"గోపీ? మీ నాన్నగారేం చేస్తారు?" అడిగారు మాస్టారు.

"డాక్టరండి" చెప్పాడు గోపి.

"శీనూ! మీ నాన్నగారు?"

"ఇంజనీర్ సార్..."

"రామూ! మీ నాన్నగారేం చేస్తారు?"

"మా అమ్మగారు చెప్పినట్టల్లా చేస్తూంటారు" అన్నాడు రాము

—దేవరాజ్ (ఆదోని)

రెండో నెల గడువు కూడా దాటి పదిరోజులైనా వెంకటేశు జాడలేదు. "ఆరి దొంగ సచ్చినోడా! నన్నే మోసం చేశావు గదరా!" నాంచారమ్మ పళ్ళు గరుచుకుంది.


అపరకాళికలా రౌద్రంతో ఊగిపోతూ వెంకటేశు ఇంటి మీదకి వెళ్ళింది. కానీ వాడు ఇంటి దగ్గరలేడు. ఆ తర్వాత వరసబెట్టి వారం రోజులు వాడి ఇంటికీ, పనిచేసే చోటికి చెడ తిరిగింది. తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోయాయే తప్ప వెంకటేశు మాత్రం దొరకలా. అంత మారాజు నాంచారమ్మ వస్తున్నాడనగానే ఎలా పసిగట్టేవాడో పసిగట్టేసే వాడు అంతే! ఆమె ఒకవైపు నుంచి వస్తుంటే తాను రెండోవైపు నుండి ఉడాయించేసేవాడు.

ఈ వరస చూసి నాంచారమ్మ నిప్పు మీద పడ్డ ఉప్పులా చిటపట లాడింది. శివమెత్తినట్టు చిందులు తొక్కింది. తన ఎదుటలేని వెంకటేశుని తిట్టిన తిట్టు తిట్టకుండా అనర్గళంగా తిట్టిపోసింది. ఎన్ని తిట్టినా, ఎంత తిరిగినా వెంకటేశుని పట్టుకోవడం ఆమెకు తలకు మించిన పనైపోయింది. ఐనా పట్టువదలని విక్రమార్కుడిలా వాడ్ని పట్టుకునేందుకు ఇంటికీ, పనిచేసే చోటికీ, ఎవరెక్కడున్నాడని చెపితే అక్కడికల్లా తిరుగుతూనే ఉంది. కథ ఇలాంటి ఘట్టంలో ఉండగా ఒకనాడు పనిలోంచి ఇంటికివస్తున్న వెంకటేశు నాంచారమ్మ కంట్లో పడ్డాడు.

తనను గమనించకుండా పరాగ్గా, వస్తున్న వెంకటేశుని చూసి అమాంతం ముందుకు దూకి చొక్కా కాలరను అందుకోబోయింది. అప్పటికి ఎదురైన ఉపద్రవం తెలిసొచ్చి ఒడుపుగా రెండడుగులు వెనక్కి గెంతి, అందకుండా తప్పించుకున్నాడు వెంకటేశు.

"ఏరా! దొంగ సచ్చినోడా! నా కళ్ళలో

## తగతెట్లాలా?



కారం గొట్టి ఎన్నాళ్లు తప్పించుకుంటావురా? డబ్బు తీసుకుని ఎగ్గొట్టటానికి ఇదేం నీ అబ్బ సొమ్మనుకున్నావేరా? ముందు నా డబ్బక్కడ పెట్టి కదులు. లేకపోతే..."

"ఊఁ లేకపోతే... ఏం చేస్తావేం?" మధ్యలోనే అందుకుని హుంకరించాడు వెంకటేశు. "ఊరుకున్న కొద్దీ రెచ్చిపోతున్నావు. ఎంత దబ్బిస్తే మాత్రం నోరు పారేసుకున్నావంటే నేనొప్పుకోను. నేనందర్లాటోణ్ణి కాదు జాగ్రత్త. మాటలు మీరారో మర్యాద దక్కదు. దారుల్లో నిలేసావంటే నేనూరుకోను. వెంకటేశు గాడంటే ఏంటో చూపిస్తా. మర్యాదగా చెపుతున్నా. ఈ నెల్లో నాచేత దబ్బు లేదు పైనెల జీతాలనాటికి ఇంటికొచ్చి కినపడు. అంతే!" కొట్టే వాడిలా మిర్రి మిర్రి చూస్తూ, మీదమీద కొస్తూ మాట్లాడుతున్న వెంకటేశు తీరుచూసి నాంచారమ్మ అదిరిపోయింది. 'మీదపడి తన్నడు గదా!' అనిపించి నాలుగడుగులు వెనక్కి తగ్గింది. ఆ షాక్ నుండి కాస్త తేరుకునేసరికి కనుచూపు మేరలో ఎక్కడా కనబడలేదు వెంకటేశు.

తన పరాక్రమం చూపించి, చెవిమెలేసి మరీ దబ్బు వసూలు చేసేందుకు వీడు అందర్లాటివాడు కాదని తెలిసొచ్చింది. తన పప్పులేవీ వెంకటేశు దగ్గర ఉడకవని ఆ దెబ్బతో తేలిపోయింది. కాగా "వీడి దగ్గరున్నంది వడ్డీ లేకపోతేపోయింది. కనీసం అసలైనా రాబట్టుకోగలదా తను' అనే సందేహం పట్టుకుంది. అయినా చెయ్యగలిగిందేమీ కనుపించక వాడు చెప్పిన ప్రకారమే జీతాల రోజు వాడింటికే బయల్దేరింది.

"వెంకటేశూ!" గుడిసె ముందు నిలబడి ఎలుగెత్తి పిలిచింది.

"లేదు." పద్దెనిమిది ఇరవై ఏళ్ళ మధ్య వయసు గల అమ్మాయి గుమ్మంలోకొచ్చి జవాబిచ్చింది.

నాంచారమ్మ ఆ పిల్లకేసి ఎగాదిగా చూసింది. మెడ బోసిగా ఉంది. అంటే బొట్టు కట్టింది కాదన్నమాట. లేచొచ్చిన బాపతే. సందేహం లేదు. అందుకే నన్నమాట ఇందాకా జోగులుగాడు అంత ఎకసక్కెంగా మాట్లాడింది. ఈ ముండ ఇట్టాంటి మోసకారేదవని నమ్మి వొచ్చింది ఇక దీని బతుకు బండలై నట్టే.

"ఏ వూరేంటి పిల్లా మంది?" లేచొచ్చిన ఆడదంటే లోకంలో ఎంత తిరస్కారమూ, వెటకారమూ ఉన్నాయో అదంతా నాంచారమ్మ గొంతులో ధ్వనించింది.

ఆ పిల్ల ఊరిపేరు చెప్పగానే నాంచారమ్మ ముఖం వెలవెలపోయింది. "నీ పేరు?" గొంతులో అంతకు ముందు లేని ఒక సౌమ్యత.

"నాగమణి."

నాంచారమ్మ ఒక్కసారిగా నిలువునా ఒణికింది. ఆ పిల్ల తండ్రి పేరు కూడా అడిగి తెలుసుకున్నాక ఇంక సందేహ మేమీ మిగల్లేదు.

చెలియలి కట్టను అధిగమించిన సముద్రమైపోయింది నాంచారమ్మ. అమాంతంగా ఆ పిల్లని వాటేసుకుని, "ఈ జన్మకి మళ్ళీ నిన్ను చూస్తాననుకోలేదే, నాతల్లీ!" అంటూ బావురుమంది.

నాంచారమ్మ శివయ్యను వదిలేసి వచ్చేనాటికి మూడేళ్ళ పిల్ల నాగమణి. ఆ పిల్లకోసమే ఆమె చాలా కాలం శివయ్య పెట్టే బాధలు సహించింది. రాఘవుల్తో లేచివచ్చినందుకు విచారించాల్సిన పరి



ఏమిస్తాడు?

"కొందరు భక్తితో దేవుడికి తల నీలాలు సమర్పిస్తారు, మరి దేవుడు వాళ్ళకేమిస్తాడు?" అడిగాడు పార్థు, పాండుని.


"కొద్దిరోజుల్లో జుట్టు..." చెప్పాడు పాండు.

—కె. లక్ష్మణ్‌ప్రసాద్ (విశాఖపట్నం)

స్థితి ఎన్నడూ రాలేదామెకు. స్వతహాగా మెత్తని మనసున్న వాడైన రాఘవులు సాంగత్యంలో ఆమె అనురాగమూ, ఆదరణా, సుఖమూ, శాంతీ అన్నీ పొందింది. రాఘవులూ తనూ కాయకష్టం చేసి సంపాదించిన డబ్బులో నాలుగు రూకలు వెనకేసి చిన్న టీ దుకాణం తెరిచింది.

నాంచారమ్మ దశ తిరిగింది. ఇప్పుడు నాంచారమ్మకు టీ దుకాణం, వడ్డీ వ్యాపారం, ఉండటానికో ఇల్లు ఒంటి నిండా నగలు చేతి నిండా డబ్బు, డబ్బువల్ల వచ్చే పలుకుబడి వీటన్నిటినీ మించి అప్పటికీ ఇప్పటికీ తనంటే ఒక్కలా పడి చచ్చే రాఘవులూ అన్నీ ఉన్నాయి.

ఇంత ఆనందంలోనూ దీపం క్రింద క్రీనీడలా ఒక వేదన నాంచారమ్మను వీడలేదు. కూతుర్ని వదలేసి వచ్చి ఇన్నేళ్లు గడిచినా ఈనాటికీ ఆమె మాతృ హృదయంలో ఆ గాయం పచ్చిగానే ఉంది. సంధ్యావసాన సమయాన మసక చీకట్లు ముసురుకుంటున్న వేళ ఇంకా దీపం వెలిగించని చీకటి గదిలో కూర్చుని కుమిలిపోయే ఆమె మూగ వేదన ఇతరులెవరికంటా పడకుండా అతి పదిలంగా దాచుకున్న ఆమె అంతరంగిక రహస్యం. ఆమె నీడలా మసిలే రాఘవులికైనా తెలియని అంశమిది. పనులన్నీ ముగించి పడక మీద వాలగానే ఏ వైపునుండో నిశ్శబ్దంగా వచ్చి ఆ మాతృ హృదయ మందిరం తెరుచుకుని లోపలికి ప్రవేశించే కూతురి స్మృతులు- రేపిన దుఃఖంతో ఆమెకు తెలియకుండానే ధారలుకట్టే ఆమె కన్నీటితో తడిసిన తల దిండు. అది ఒక్కటి మాత్రమే ఆమె ఈ నిగూఢ వేదనకు మూగసాక్షి.



ఇన్నేళ్ళ తర్వాత ఇలా అనుకోని విధంగా కూతుర్ని కలుసుకోవటంతో గుండెల్లో గూడు కట్టుకున్న బాధంతా కరిగి కన్నీరైంది దుఃఖోద్వేగం తగ్గి మామూలు మనిషయ్యాక కూతుర్నడిగి సంగతులన్నీ తెలుసుకుంది. పనికోసం పట్నం వచ్చి చేరిందుగానీ వెంకటేశం స్వస్థలం కూడా తను ఊరేనట. ఇద్దరూ ప్రేమించుకున్నారు.

తండ్రి ఈ ప్రేమను ఆమోదిస్తాడన్న నమ్మకం లేని నాగమణి, "పట్నం పోయి గుళ్ళో పెళ్ళి చేసుకుందాం" అన్న వెంకటేశు మాట నమ్మి వాడితో వచ్చేసింది. వచ్చి వారం రోజులైనా వెంకటేశు పెళ్ళి ఊసెత్తటంలేదు. తను గుర్తు చేసినా 'చూద్దాం'లెమ్మని రోజులు దాటేస్తున్నాడు.

సంగతి విని ముందు విచారించినా, తర్వాత 'నా బిడ్డ నా దగ్గరకొచ్చి చేరింది. ఇంక దిగులెందుకు?' అనుకుంది నాంచారమ్మ.

కూతుర్ని వెంటపెట్టుకుని ఇంటికి తిరుగు ముఖం పట్టింది. ఇప్పుడు నాంచారమ్మ ముఖం తుమ్మల్లో పొద్దుగూకినట్టు ధుమధుమలాడటంలేదు. వరాలివ్వటానికి దిగివచ్చిన దేవత ముఖంలా ప్రసన్నంగా ఉంది. ఇప్పుడామె అలంకరించిన గ్రామదేవత గంగానమ్మలాలేదు ఒంటినిండా నగల్తో అపరలక్ష్మీదేవిలా కళకళలాడుతోంది.

* * *

నాంచారమ్మ తన కూతురు చి॥సౌ॥ నాగమణిని చి॥ వెంకటేశు కిచ్చి అతి వైభవంగా వివాహం జరిపించింది. నాంచారమ్మను ఎరుగున్న వాళ్లూ, ఆహూతులై పెళ్ళికి వెళ్ళిన వాళ్లూ అందరూ ఆ కళ్యాణ వైభవాన్ని గురించి గొప్పగా చెప్పుకున్నారు.

అంతకంటే ముఖ్యంగా నాంచారమ్మకు ఋణగ్రస్తులైన వాళ్లూ, ఇంకా అనేక విధాలుగా నాంచారమ్మ క్రోధానికి గురై బాధితులైన ఇరుగు పొరుగులూ అందరూ మహా విచిత్రంగా చెప్పుకున్న సంగతులు రెండున్నాయి.

మొదటిది నాంచారమ్మ తనకు బాకీ ఉన్న వాళ్ళందరూ ఇకపై వడ్డీ కట్టనక్కర్లేదనీ, అసలు మాత్రం కొంచెం కొంచెంగా చెల్లిస్తే చాలనీ ప్రకటించటం. రెండవది ఎప్పుడూ ఎవరితోనో ఒకరితో కలహిస్తూ, అందర్నీ పీడిస్తూ ఉండే నాంచారమ్మ ఇప్పుడు ఎవరితోనూ పోట్లాడటంలేదు. ఎవర్నీ వేధించటంలేదు. పైపెచ్చు సదా ప్రసన్న వదనంతో అందరి ఎడలా స్నేహ భావంతో మసలుకుంటున్నది.

నాంచారమ్మలో హఠాత్తుగా వచ్చిన ఈ పరివర్తనకు కారణమేమిటన్నది అందరికీ అభేద్యమైన ప్రశ్నగా మిగిలిపోయింది. ✱



### తీసికెళ్ళండి

ముగ్గురు తాగుబోతులు పూటుగా తాగేసి ఓ ఇంటి ముందు నిలుచున్నారు. తలుపు తట్టారు

"ఎవరు కావాలి" అడిగింది ఆ ఇల్లాలు.

"ఇది సుబ్బారావుగారిల్లేనా, అయితే ఆవిడను పిలవండి" అన్నారు.

"నేనే...ఏం?" అందామె.

"బయటికొచ్చి మీ వారెవరో తీసుకెళితే మిగతా ఇద్దరం వెళ్ళిపోతాం" అన్నాడు తాగుబోతు.

-సిరిసిల్లా రశీద్ శిక్షక్ (దోమకొండ)